క్లుప్తంగా

రక్తదానం

వైవీయూ : ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి రక్తకొరత లేని సమాజాన్ని నిర్మించేందుకు ముందుకు రావాలని సీఆర్ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు సునీల్ జయంత్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సంధ్య సర్కిల్‌లో బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తదాన వారోత్సవాల్లో 6వ రోజుల రక్తదాన శిబిరం నిర్వహించారు. 15 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్లడ్ టు లివ్ పవన్, సీఆర్ఐ దినేష్‌కుమార్, రిమ్స్ బ్లడ్ బ్యాంకు డాక్టర్ ప్రవీణ్, సిబ్బంది శారద, హరి, భాస్కర్, పద్మ, పుల్లయ్య, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సర్వే

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్పెషల్ క్యాంపులో భాగంగా గురువారం నగరంలోని నిరంజన్ నగర్‌లో యూత్‌పాలసీపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంకాల్ నాగరాజు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువత కోసం అందిస్తున్న పథకాలపై వలంటీర్లు సర్వే నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

బంధాలను బలపరిచే 'ఈద్ మిలాప్'

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ పండుగ అనంతరం నిర్వహించే ఈద్ మిలాప్‌లు ముస్లింల మధ్య బంధాలను మరింతగా బలపరుస్తాయని నగర ప్రముఖులు సయ్యద్ అక్బర్ బుఖారి అన్నారు. కడప నగరం బళ్లారిరోడ్డు లోగల సంఘం కార్యాలయంలో గురువారం ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈద్ మిలాప్‌తో పరిచయాలు బలపడి బంధాలుగా మారగలవని పేర్కొన్నారు. త్వరలో వైద్య కళాశాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు సయ్యద్ మహమ్మద్ బుఖారి, షేక్ నసీరుద్దీన్, సయ్యద్ తయ్యుబ్ బుఖారి, కార్పొరేటర్ మగ్బూల్ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

కడప ఎడ్యుకేషన్ : మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లలకు విలువలతో కూడిన విద్యనందించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, బనగానపల్లె అసెంబ్లీ పరిశీలకులు అఫ్జల్‌ఖాన్ పేర్కొన్నారు. కడప మట్టిపెద్దపులి వద్ద ఉన్న మదర్ ఇండియా స్కూల్‌లో గురువారం నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో బోధనలు చేయడంతోపాటు బాగా చదివించి ఉన్నతస్థానాల్లో నిలిపేందుకు యాజమాన్యాలు కృషి చేయాలన్నారు. మదర్ ఇండియా స్కూల్‌కరస్పాండెంట్ షేక్‌సాదిక్‌బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థికి పాలిసెట్ మెటీరియల్‌ను అందచేస్తున్న ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ -2023 పరీక్ష కోసం ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గురువారం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్ సిహెచ్. జ్యోతి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలిసెట్ ఉచిత శిక్షణకు పది పరీక్షలు రాసిన వివిధ పాఠశాలల నుంచి 50 మందిదాకా బాలబాలికలు వస్తున్నారని తెలిపారు. వీరందరికీ ఉచిత శిక్షణతోపాటు స్టడీ మెటీరియల్‌ను అందచేశామన్నారు. పాలిసెట్ పరీక్షకు ఏప్రిల్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పాలిసెట్ పరీక్ష కోసం ఉచిత శిక్షణను రోజు ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణ మే 7వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో గంధం



మైదుకూరు : మండలంలోని హజరత్ అష్రఫే-దోజహ్ -ఆరా - మా సాహెబా (మాతృశ్రీ) ఆశ్రమంలో గురువారం గంధం మహోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మైదుకూరు - బద్వేలు రహదారిలో నంద్యాలంపేట వద్ద ఉన్న ఈ ఆశ్రమంలో గంధం మహోత్సవాలలో గురువారం ప్రొద్దుటూరు నుంచి శ్రీహజరత్ జహూర్ అలీషా ఖాద్రి చిష్తి కుమారులు, జీవీ సత్రం నుండి పఠాన్ సత్తార్ ఖాన్ కుమారులు గంధాన్ని తీసుకొచ్చారు. అష్రఫే దోజహ్ - ఆరా - మా సాహెబా, గౌస్ యాజం దస్తగిరి స్వామి వారికి హజరత్ జహూర్ అలీషా ఖాద్రి వారికి గంధాన్ని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం ఫాతేహా నిర్వహించారు. గంధం మహోత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

చిన్నారుల భవితకు అంగన్‌వాడీలు పునాది

మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్





మాట్లాడుతున్న కమిషనర్ | చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఐసీడీఎస్ పీడీ రాణి, సీడీపీఓలు



చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమం

కడప కార్పొరేషన్ : చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు అంగన్‌వాడీ కేంద్రాలు పునాదిగా నిలవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్ చంద్ అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ ఆడిటోరియంలో 'ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే' పేరుతో అంగన్‌వాడీ పిల్లలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రీ స్కూల్ పూర్తి చేసుకున్న పిల్లలకు అభినందనలు తెలుపుతూ, వారిని చక్కగా తీర్చిదిద్దిన మొదటి గురువులు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలేనని తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ రాణి మాట్లాడుతూ చదువు పిల్లలను భయపెట్టేదిగా ఉండకూడదని, చిన్న వయసులో పిల్లలపై ఒత్తిడి తగ్గించేలా.. ఆడుతూ పాడుతూ సాగేలా ఉండాలని సూచించారు. సీడీపీఓ సునంద, ఏసీడీపీఓ శోభారాణి, సూపర్‌వైజర్లు ఎస్. రేణుక, బి. రేణుక, పద్మజ, దీప, మాబూచాన్, రెడ్డెమ్మ, నాగరత్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అదరగొట్టిన అంగన్‌వాడీ చిన్నారులు

జిల్లాలో తొలిసారిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే చిన్నారులకు నిర్వహించిన 'ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే'లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బుడిబుడి నడకలతో బుల్లి, బుల్లి స్టెప్పులు వేస్తూ వచ్చీరాని మాటలతో పదాలు, పద్యాలు చెబుతుంటే అందరూ ఆసక్తిగా తిలకించారు. వేమన పద్యాలు కొందరు వల్లె వేస్తే, జాతీయ చిహ్నాలు, జంతువులు, పక్షుల గూర్చి మరికొందరు చెప్పారు. కూచిపూడితోపాటు సినిమా పాటలకు కూడా డ్యాన్సులు అదరగొట్టారు. నానాపల్లె, ఫరీడా నగర్, కో ఆపరేటివ్ కాలనీ, సుబ్బన్నగారిపల్లె, యానాది కాలనీ, రూకవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మట్టి మాఫియాను అరికట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో మట్టిమాఫియాను అరికట్టాలని కాంగ్రెస్ నాయకులు సత్తార్, బండి జకరయ్య పేర్కొన్నారు. ఈ విషయమై గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో గంగాధర్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రయోజనకరంగా ఉండటం కోసం.. భూములు సారవంతం చేసుకునేందుకు చెరువు మట్టిని వ్యవసాయ భూములకు తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దీనికోసం ఆర్డీవో, తహశీల్దార్, ఇరిగేషన్ ఈఈ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అయితే జిల్లాలో అధికారులు కాల పరిమితి లేకుండా అనుమతి ఇవ్వడంతో కొందరు మట్టి మాఫియాకు వరంగా మారిందన్నారు. రైతుల పేరిట అనుమతులు తీసుకొని రోడ్ల నిర్మాణం కోసం, భవన నిర్మాణాల కోసం ఇతరత్రా వ్యాపార అవసరాల కోసం అమ్ముకుంటూ రూ.కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్తు తరాల మట్టి అవసరాల కోసం మట్టి మాఫియాను నియంత్రించాలని కోరారు.

ఘనంగా కడప రాయుడి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత మూలమూర్తికి, అనంతరం ఉత్సవమూర్తులకు విశేష అభిషేకం, అనంతరం కనుల పండువగా అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చారు. భక్తుల జయ జయధ్వానాల మధ్య పల్లకీ దేవునికడప మాడవీధుల్లో సాగింది. గ్రామస్తులు తమ వీధిలోకి తరలివచ్చిన కడప రాయుడిని దర్శించుకుని పూజా ద్రవ్యాలు సమర్పించి ప్రార్థనలు చేశారు. అర్చకులు వారికి హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు త్రివిక్రమ్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇతర కార్యక్రమాలు నిర్వహించారు.

యూనియన్ గుర్తింపు రద్దు దారుణం



పోస్టల్‌శాఖ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వ్యవసాయ చట్టాల రద్దు కోసం పోరాడుతున్న రైతు సంఘాలకు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ విరాళాలు సేకరించిందన్న కారణంతో గుర్తింపు రద్దు చేయడం దారుణమని ఆ యూనియన్ డివిజన్ సెక్రటరీ జీవీ సుబ్బారెడ్డి విమర్శించారు. గురువారం కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ చట్టాల రద్దు కోసం పోరాడుతున్న రైతు సంఘాలకు కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య ద్వారా విరాళాలు అందజేశారన్న నెపంతో గుర్తు రద్దు చేయడం తగదన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం గుర్తింపు రద్దు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నిర్మాణ కార్యదర్శి భానుకృష్ణ, జిల్లా అధ్యక్షులు రమణయ్య, నాయకులు మహబూబ్ బాష, నాగేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విశేష ప్రతిభ



సాయిచరణ్‌రెడ్డి



సంధ్య



లక్ష్మినవ్య



రామరజిత

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కడప గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇందులో ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో చరణ్‌సాయిరెడ్డి 464 మార్కులు సాధించగా నిఖిలేశ్వర్ 458, మమత 456 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో ఉష 431, సంధ్య 431, నరేష్ 426 మార్కులను సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో లక్ష్మినవ్య 983 మార్కులను సాధించగా అనూష్ 983, సమీర్ 979 మార్కులను సాధించారు. బైపీసీ విభాగంలో డింపుల్ కన్సర్ 981 మార్కులు సాధించగా స్నేహ 980, జ్యోతి 979 మార్కులను సాధించారు. అలాగే ఎంఈసీ ప్రథమ సంవత్సరానికి చెందిన రామరజిత 498 మార్కులు సాధించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ పురుషోత్తమరెడ్డి, ప్రిన్సిపాల్ జగదీష్ అభినందించారు.

శ్రీచైతన్య విజయభేరి

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ ఫలితాల్లో కడప శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఇందులో ప్రథమ సంవత్సర బైపీసీ విభాగంలో తేజస్వి బ్లెస్సీ 440 మార్కులకుగాను 435 మార్కులు సాధించగా హర్షిత షారోన్433, శ్రీలక్ష్మి, వీరశ్రావణ్‌రెడ్డి, గీతికారెడ్డిలు 432, తన్మెయి 423 మార్కులు సాధించారు.

అలాగే ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో లేఖ్యరెడ్డి, వాసవి, దీప్తి అపర్ణలు 461 మార్కులు, దీపిక, స్పందన, బి. దీపికలు 460, చంద్రిక, దేవనందినిలు 456, సుజిత 455 మార్కులతో ప్రతిభ చూపారు. అలాగే ద్వితీయ సంవత్సర బైపీసీలో వాసవి, పాతిమానికతున్నీసా 984 మార్కులు, ప్రీతిక 983, హర్షవర్ధన్‌రెడ్డి 982 మార్కులతో రాణించారు. ద్వితీయ ఎంపీసీ విభాగంలో మేధాశ్రీ 987 మార్కులు సాధించగా స్వర్ణలత 985, సుమయ్య 982, సంతోష 964 మార్కులను సాధించారు. విద్యార్థులను శ్రీచైతన్య ఏజీఎం ప్రసాద్, డీన్ కేఎల్‌జీ ప్రసాద్, ప్రిన్సిపాల్ నాగరాజు, పరమేశ్వరెడ్డి, ఏవోలు మనోజ్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జున స్వామి, వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, రాజా అభినందించారు.



విజయకేతనం చూపుతున్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలల విద్యార్థులు, సిబ్బంది

పరిమళించిన విద్యా కుసుమం



నఫీసాఖానంకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

కడప ఎడ్యుకేషన్ : తండ్రి కష్టాన్ని గుర్తెరిగి కుమార్తె కష్టపడి చదివింది. మార్కుల పంట పండించింది. కడప నగరం మోచంపేటలో నివాసముండే అబ్బాస్ ఆలీఖాన్ వైవీస్ట్రీట్‌లోని పాత మార్కెట్ వద్ద చిరు పూలవ్యాపారి. అందులో వచ్చే అరకొర సంపాదనతోనే కుటుంబాన్ని పోషించుకుంటూ తమ ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నారు. తండ్రి కష్టాన్ని గుర్తెగిన నఫీసా ఖానం కష్టపడి చదివింది. ఇంటర్ బైపీసీలో ఉత్తమ మార్కులను సాధించింది. కడప ఎన్‌జీవోకాలనీలోని శ్రీచైతన్య అకాడమి జూనియర్ కళాశాలలో చదివిన ఈమె ఇంటర్ బైపీసీ ప్రథమ సంవత్సర ఫలితాల్లో 440 మార్కులకుగాను 436 మార్కులను సాధించింది. బాగా చదివి ఎంబిబిఎస్ చేసి కార్డియాలజిస్టు కావడమే తమ జీవితలక్ష్యమని నఫీసా తెలిపారు. మంచి మార్కులు సాధించినందుకుగాను నఫీసా ఖానంను ఇంటర్ ఆర్ఐవో రమణరాజుతోపాటు శ్రీ చైతన్య అకాడమి ప్రిన్సిపాల్ మల్లికార్జున అభినందించారు.

మాజీమంత్రి పెంచికల బసిరెడ్డికి నివాళి

కడప కల్చరల్ : స్వాతంత్ర్య ఉద్యమయోధుడు, మాజీమంత్రి పెంచికల బసిరెడ్డి 46వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని సంధ్య సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు, బసిరెడ్డి లా కళాశాల కరస్పాండెంట్ పెంచికల రఘునాథరెడ్డి మాట్లాడుతూ జై ఆంధ్ర ఉద్యమ సమయంలో తమ తండ్రి రాయలసీమ ఉద్యమానికి బీజం వేస్తూ ప్రొద్దుటూరులో మహాసభలు నిర్వహించారని గుర్తు చేశారు. ప్రముఖ రచయితలు కేతు విశ్వనాథరెడ్డి, పాలగిరి విశ్వప్రసాద్, పెండ్లిమర్రి మండల అధ్యక్షులు వరలక్ష్మి, బసిరెడ్డి లా కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మహిళలను వేధించిన బీజేపీ ఎంపీ బిజు భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మనోహర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని పాతబస్టాండు వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజధాని జంతర్‌మంతర్ వద్ద మహిళా రెజ్లర్లను వేధించిన ఎంపీని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన ప్రజాప్రతినిధులే మహిళలను వేధించడం దుర్మార్గమన్నారు. బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాలలో దళితులకు, మహిళలకు రక్షణ కరువైందన్నారు. సంఘం నాయకులు చంద్రారెడ్డి, దస్తగిరిరెడ్డి, రాజేంద్ర, ఫరూక్ హుస్సేన్, వెంకట సుబ్బయ్య, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బీజేపీకి మద్దతుగా మాట్లాడటం దారుణం

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మద్దతుగా మాట్లాడటం దారుణమని ప్రభుత్వ ఖాజీలు హఫీజ్ షేక్ ఎండీ ఇసాక్, ముఫ్తీ జుబేర్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక రవీంద్రనగర్‌లో వారి కార్యాలయంలో మతపెద్దలు మౌలానా యూసుఫ్, హఫీజ్ ఖాజా హుస్సేన్, హఫీజ్ అబ్దుల్ రజాక్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఇటీవల రిపబ్లిక్ టీవీతో మాట్లాడుతూ మోడీ అభివృద్ధి విధానాలతో ఏకీభవిస్తున్నానని, మోడీ దేశం గూర్చి ఆలోచిస్తున్నారని ఆకాశానికి ఎత్తేస్తూ మాట్లాడారన్నారు. కర్నాటకలోని బీజేపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేసిందని, ఇటీవల తెలంగాణ పర్యటన కొచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా తాము అధికారంలోకి వస్తే అక్కడ కూడా మైనార్టీల రిజర్వేషన్లు రద్దు చేస్తామని మాట్లాడారన్నారు. ముస్లింల రిజర్వేషన్లు ఎత్తేసి, వారిపై దాడులు చేసేవారికి చంద్రబాబు మద్దతు పలకడం దారుణమన్నారు. చంద్రబాబు మాటలు నమ్మి ఆయనతో నడవడానికి ముస్లింలు సిద్ధంగా లేరన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదైతే, ముస్లింలను రాజకీయంగా అందలం ఎక్కించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని తెలిపారు. ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనాలు ఇవ్వడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ముస్లింకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. మైనార్టీలకు ఎల్లప్పుడు అండగా నిలుస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లిం సమాజం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

అర్హత ఉన్న హెల్పర్లకు పదోన్నతి కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకురాళ్లు

కమలాపురం : అర్హత ఉన్న ఐసీడీఎస్ హెల్పర్లకు పదోన్నతి కల్పించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు ఎస్.మంజుల డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ నారాయణరెడ్డికి ఆమె వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని చిలంకూరు సెక్టారులో మాలేపాడు గ్రామంలోని రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేయడం జరిగిందన్నారు. ఖాళీగా ఉన్న ఆ పోస్టును అర్హులైన, సీనియార్టీ ఉన్న హెల్పర్లతో కాకుండా ఎలాంటి అర్హతలు లేని హెల్పర్‌తో కమలాపురం ఐసీడీఎస్ అధికారులు లాలూచీ పడి ఆ పోస్టును కట్టబెడుతున్నారని ఆమె ఆరోపించారు. సీనియార్టీ ప్రకారం పదోన్నతి కల్పించకుండా ఇష్టం వచ్చినట్లు అక్రమాలకు పాల్పడుతున్న ఐసీడీఎస్ అధికారుల పట్ల చర్యలు తీసుకోవాలని ఆమె అందులో పేర్కొన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ధర్నాలు చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకురాళ్లు రాణి, పద్మజ, రమణమ్మ, యశోద, నరసమ్మ, పార్వతమ్మ, విశ్వనాథమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ. 500కే సిలిండర్ ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌ను రూ. 500లకే ఇవ్వాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బషీరున్నీసా డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏపీ మహిళా సమాఖ్య రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఈ కారణంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య నాయకురాళ్లు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఉన్న జనుము విత్తనాలు



రైతులకు జనుము విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

చెన్నూరు : మండలంలో మొదటి విడతగా 18 క్వింటాళ్ల జనుములు, విత్తనాలు రైతులకు పంపిణీ చేసేందుకు రైతు భరోసా కేంద్రంలో సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీదేవి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రామనపల్లెలో 10 క్వింటాళ్లు, చెన్నూరు రైతు భరోసా కేంద్రంలో 5 క్వింటాళ్లు, కనపర్తి రైతు భరోసా కేంద్రంలో 3 క్వింటాళ్ల జనుము విత్తనాలు రైతులకు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. కేజీ జనుము ధర రూ.84 ఉండగా రైతు వాటా రూ.42, సబ్సిడీ రూ.42గా ఉందన్నారు. రైతుకు ఉన్న విస్తీర్ణాన్ని బట్టి ఎకరాకు 10 కిలోల చొప్పున గరిష్టంగా 50 కిలోలు వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. కడప సహాయ వ్యవసాయ సంచాలకులు సుబ్బారెడ్డి చెన్నూరు గ్రామంలో రైతులకు జనుము విత్తనాలు అందజేసి పంపిణీని ప్రారంభించారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఫోన్ నెంబరు, ఆధార్‌తో రైతు భరోసా కేంద్రానికి వచ్చి పొందాలని ఆమె తెలిపారు. అలాగే కొత్తగా దరఖాస్తు చేసుకునే రైతులు ఈనెల 30వ తేదీలోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ చరణ్‌కుమార్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సృజన పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించండి

పెండ్లిమర్రి : వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీపీ ఎం.వరలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో గురువారం ఎంపీపీ మాచునూరు వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ముందస్తుగా తాగునీటి సమస్యలు ఏర్పడే గ్రామాలను గుర్తించాలన్నారు. ఎక్కడైన మోటార్లు మరమ్మతులకు గురైతే తక్షణం అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ పి.బాలయ్య మాట్లాడుతూ మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కొన్ని గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నాయని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈకి సర్పంచ్‌లు విన్నవించారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆడిట్ తప్పక నిర్వహించాలి

మైదుకూరు : ప్రతి పాఠశాలలో సోషల్ ఆడిట్ తప్పక నిర్వహించాలని డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి అన్నారు. మైదుకూరు మండల విద్యా శాఖాధికారి కార్యాలయంలో స్కూల్ పెర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ టూల్‌పై ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ వరల్డ్ బ్యాంకు ఆంధ్రప్రదేశ్‌తో సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా స్కూల్ పెర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ టూల్‌లో తల్లిదండ్రుల కమిటీ సభ్యుల చేత ఈ సోషల్ ఆడిట్‌ను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పద్మలత, సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి కేశవరెడ్డి, రీసోర్స్ పర్సన్లు వై.వెంకట సుబ్బయ్య, టీకే సురేష్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు పుల్లయ్యపై 2021లో వచ్చిన ఫిర్యాదులపై డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి విచారణ చేశారు. సిలబస్ పూర్తి చేయలేదని అప్పట్లో పుల్లయ్యపై ఫిర్యాదు రావడంతో ప్రాథమిక విచారణ జరిపి తలమించిపట్నం పాఠశాలకు బదిలీ చేశారు.

సీమవాసులు మంచివారు

జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ హరిబాబు



మెజిస్ట్రేట్ హరిబాబును సన్మానిస్తున్న న్యాయవాదులు

కమలాపురం : రాయలసీమ ప్రాంత వాసులు చాలా మంచివారని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ హరిబాబు తెలిపారు. కృష్ణాజిల్లా నూజివీడుకు బదిలీపై వెళ్లిన ఆయనను బార్ అసోసియేషన్, న్యాయవాదుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ హరిబాబు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి రావాలంటే చాలా బాధ పడుతూ వచ్చానన్నారు. అయితే ఇపుడు బదిలీపై తిరిగి వెళ్లాలంటే మనసు ఒప్పుకోవడం లేదన్నారు. రాయలసీమ వాసులు చాలా మంచి వారన్నారు. కమలాపురం నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్ రవీంద్రప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఏజీపీ గురవయ్య, అడ్వకేట్స్ పుష్పరాజు, మహేశ్వర్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్ తదితరులు మెజిస్ట్రేట్‌ను సన్మానించారు.

నేడు ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు

బద్వేలు అర్బన్ : ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ విభాగాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరు రోడ్డులోని రాఘవేంద్ర గ్రాండ్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ అవగాహన సదస్సుకు ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ సజ్జా శ్రీచైతన్య, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, జిల్లా యువజన సర్వీసుల అధికారి సాయిగ్రేస్ తదితరులు హాజరవుతారని, 17 ఏళ్లు పైబడి ఆసక్తి కలిగిన యువకులు అవగాహన సదస్సుకు హాజరుకావాలని కోరారు.

రికార్డుల నిర్వహణ సరిగా లేకుంటే చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : స్కానింగ్ సెంటర్లలో రికార్డుల నిర్వహణ సరిగా లేకుంటే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ హెచ్చరించారు. ప్రొద్దుటూరులోని స్కానింగ్ సెంటర్లను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు స్కానింగ్ సెంటర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ లేని స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయడంతో పాటు డాక్టర్ సర్టిఫికెట్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం లింగ నిర్ధారణ చేయరాదని ఆమె వివరించారు.

వైభవం.. గంగా జయంతి ఉత్సవం



రాజుపాళెం: మండలంలోని అర్కటవేముల గ్రామంలో ఎంతో విశిష్టత కలిగిన పాత గంగమ్మ ఆలయంలోని గ్రామదేవత గంగమ్మ జయంతి ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ చేసి ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు చేశారు. అలాగే ఆలయంపై శిఖర కలశ ప్రతిష్ఠ అమ్మవారికి మకరతోరణం ఏర్పాటు చేశారు. ఈ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజలు తరలివచ్చారు. భక్తుల కోర్కెలు తీర్చే కల్పతరువుగా గ్రామ దేవత గంగమ్మ ఇక్కడ కొలువై ఉందని భక్తులు చెబుతున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.